క్లుప్తంగా

నేడు నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ

గరుగుబిల్లి: త్వరలో నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ ఎ.ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని 13 సాగునీటి చెరువులతో పాటు తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువలకు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈమేరకు ఎన్నికల సిబ్బంది ఈ శిక్షణకు విధిగా హాజరు కావాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకులు దోని సురేష్, పల్ల సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారంతా మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో గురుకులం పాఠశాల సిబ్బంది స్థానాలను కలుపుతామని ప్రభుత్వం చెప్పడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన గురుకుల ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. పీఆర్సీ అమలు చేయాలని, సమానం పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్సీ సంఘీభావం

సీతంపేట: గిరిజన గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలంటూ గత 8 రోజులుగా చేస్తున్న రిలేనిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు సంఘీభావం తెలిపారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు అడవితల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట పీఆర్‌టీయూ ప్రెసిడెంట్ పి.రాజేశ్వరరావు, బైరి అప్పారావు, వి.హరిశ్చంద్రుడు, జి.విజయమోహన్, రఘురాం, రామ్మోహన్‌రావు, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాలు సరిచూసుకోండి

పాలకొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలను సరిచూసుకోవాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచామని, ఉపాధ్యాయులు వాటిని సరిచూసుకోవాలని అన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇంకా ఓటు హక్కు నమోదు చేసుకోనివారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించాలి

సీతంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ కోరారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పలు ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో బుధవారం ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు రఘువర్మకు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. అంతకుముందు ఐటీడీఏ ముఖద్వారం వద్ద గత వారం రోజులుగా రిలేనిరాహార దీక్షలు చేస్తున్న గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సంఘీభావం తెలియజేశారు. వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షుడు దుర్గారావు, పాలకొండ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసు సూర్యనారాయణ, నాగరాజు, ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతుల ఆదాయం రెట్టింపు



ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ షణ్ముఖరాజు

గరుగుబిల్లి: రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో మేలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. తోటపల్లిలోని జట్టు కార్యాలయంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, బలిజిపేట మండలాలకు చెందిన 60 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీపీఓ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన సాగు పద్ధతులు పాటించడం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండించడం, తక్కువ విస్తీర్ణంలో పలు పంటలు పండించ ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రతీ రైతు పాటించేలా చూడాలన్నారు. ఏటీఎం మోడల్ సాగు, ఘన, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు.

వేసవిని తలపిస్తున్న

విద్యుత్ కోతలు



వీరఘట్టం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

- సంత-నర్సిపురం ఫీడర్ బ్రేక్ డౌన్
- మరమ్మతులకు గురైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- రోజుకు 4 నుంచి 5 గంటల పాటు సరఫరాలో అంతరాయం
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



మరమ్మత్తులకు గురైన కొత్తగా అమర్చిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్

వీరఘట్టం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వారం రోజులుగా తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. రోజుకు 4 లేద 5 గంటల చొప్పున కరెంటు తీసేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ కోతలు వేసవిని తలపిస్తున్నాయని మండిపడుతున్నారు. ఏటా వేసవిలో అధిక విద్యుత్ వినియోగం జరుగుతున్నందున అందుకు సరిపడేలా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.1.20 కోట్లు ఖర్చు చేసి కొత్తగా 5 ఎంవీఏ సామర్థ్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఏడు నెలలకే ఆ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో గత వారం రోజులుగా విద్యుత్ అంతరాయం బాగా పెరిగింది. దీనికి తోడు ఈ సబ్ స్టేషన్‌లో ఉన్న సంత-నర్సిపురం ఫీడర్ తరచూ బ్రేక్ డౌన్‌కు గురవ్వడంతో లైన్ మొత్తం ట్రిప్ అవుతోంది. గత వారం రోజులుగా విద్యుత్ పంపిణీ అస్తవ్యస్తంగా ఉండడంతో విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై వినియోగదారులు మండిపడుతున్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య ఉంది

గత వారం రోజులుగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు వస్తున్నాయి. అందువల్లే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు 5 ఏళ్ల వారంటీ ఉంది. కంపెనీ వాళ్లు వచ్చి దాన్ని పరిష్కరిస్తారు. కొద్ది రోజుల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడతాం.
– అనీల్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఈ, వీరఘట్టం

ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. ఈ కాలంలోనే విద్యుత్ అంతరాయం ఇలా ఉంటే రానున్న వేసవిలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

సంత-నర్సిపురం విద్యుత్ లైన్ సోమవారం ఉదయం 8.45 గంటలకు బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరలా మధ్యాహ్నం 3.45 గంటలకు సరఫరా పునరుద్ధరించారు. దీంతో ఈ లైన్‌లో ఉన్న 8 పంచాయతీలకు ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతేకాకుండా సబ్‌స్టేషన్‌లో ఉన్న ఈ ఫీడర్ కండక్టర్, సెక్షన్ ఫీజులు తరచూ తెగిపోతుండడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను సకాలంలో పరిష్కరించేందుకు పూర్తిస్థాయి ఏఈ లేకపోవడంతో సరఫరా పునరుద్ధరణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఇక్కడ ఏఈగా పనిచేసిన డి.బాలాజీ శ్రీకాకుళంకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో ఇంతవరకు ఎవరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం ఏఈ కుర్చీ ఖాళీగానే ఉంది. సబ్ ఇంజినీరుగా ఉన్న అనీల్‌కుమార్ ప్రస్తుతం పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే ఆయనకు అంత అనుభవం లేకపోవడంతో విద్యుత్ సమస్య వచ్చేటప్పుడు దాన్ని పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వెంటనే కొత్త ఏఈని నియమించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్లు అని ఎల్విన్‌పేట సీఐ హరి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎంతో మంది గిరిజనలు అత్యవసర సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దాతలు ముందుకువచ్చి రక్తదానం చేయడం ద్వారా అటువంటి వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 40 యూనిట్లు రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఎ.శ్రీవాణి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం, ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది స్వరూప, తులసి, ఆశోక్‌కుమార్ పాల్గున్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ భాను, తదితరులు

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు భవితా కేంద్రం ద్వారా అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం హైదరాబద్‌కు చెందిన అలిమ్ కో సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధితశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కవిత మాట్లాడుతూ శిబిరంలో ఎంపిక చేసిన వారికి త్వరలో ఉపకరణాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎండీఓ ఎంపీ రంగారావు, తదిరులున్నారు.

మలేరియా, డెంగీ పరీక్షలు తప్పనిసరి



రక్త పరీక్షల కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న సూర్యనారాయణ

పాలకొండ రూరల్: ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు రక్తపరీక్షలు చేసే సమయంలో మలేరియా, డెంగీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా సహాయ మలేరియా నియంత్రణ అధికారి సూర్యనారాయణ స్పష్టం చేశారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడి రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. గత రెండు నెలల్లో ఎంత మందికి పరీక్షలు చేశారు, మలేరియా, డెంగీ కేసులు ఎన్ని నమోదయ్యాయి, తదితర వివరాలను ఆరాతీశారు. మలేరియా, డెంగీ నిర్ధారణకు సంబంధించిన పరీక్ష కిట్లు ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రం నుంచి తెప్పించుకోవాలని, రోజువారీ నివేదికలు సక్రమంగా నమోదు చేయాలని ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు.

వంద రోజులు పని కల్పించేలా ప్రణాళికలు

వీరఘట్టం: ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, సాంకేతిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పల్లె పండుగ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను గుర్తించిన పనులకు అంచనాలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ జి.సత్యంనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సోషల్‌మీడియా, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. మదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిమాణాలు, రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వై.అమ్మన్నరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

జీరోటిల్లేజ్ విధానం లాభదాయకం

భామిని: రబీలో మొక్కజొన్న సాగు రైతులు జీరో టిల్లేజ్ విధానంలో తక్కువ ఖర్చుతో విత్తనాలు వేసుకోవచ్చని పాలకొండ ఏడీ కె.రత్నకుమారి, సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని కోసలి, సతివాడలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జీరో టిల్లేజ్ విధానంలో పొలాన్ని దుక్కి చేయకుండానే మొక్కజొన్న విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో అతి తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. ధాన్యం, పత్తిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు అనుసరించాల్సిన నిబంధనలను వివరించారు. సర్పంచ్ పాశర్ల రామారావు, వీఏఏ నాగరాజు, హెచ్‌ఓ జయశ్రీ పాల్గొన్నారు.

పరిహారం అందించి ఆదుకుంటాం..



నష్టాన్ని అంచనా వేస్తున్న ఏడీఏ రత్నకుమారి, తహసీల్దార్ అప్పారావు

భామిని: అగ్ని ప్రమాదంలో వరిపంటను కోల్పోయిన గిరిజన రైతులకు పంట నష్టపరిహారం అందిస్తామని పాలకొండ ఏడీఏ కె.రత్నకుమారి భరోసా ఇచ్చారు. మండలంలోని బూర్జగూడలో అగ్నికి ఆహుతైన వరిచేను, నూర్పుడి యంత్రాన్ని తహసీల్దార్ నీలాపు అప్పారావు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి బుధవారం పరిశీలించారు. పంట నష్టాన్ని గుర్తించి, భూమి వివరాలు నమోదు చేసుకున్నారు. సాంకేతిక వ్యవసాధికారి కిమిడి మన్మథరావు, భామిని హెచ్‌ఏ అలికాన ఎర్రన్న, గిరిజన నాయకులు బిడ్డిక అనంతరావు, తదితరులున్నారు.

గిరిజన మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- డివిజినల్ మత్స్యశాఖ అధికారి గోపీకృష్ణ



వీరఘట్టం: తెట్టంగి చెరువులో చేపపిల్లలు విడిచిపెడుతున్న మత్స్యశాఖ అధికారులు



పాలకొండ రూరల్: లుంబూరు పెద్దచెరువులో చేపపిల్లలు విడిచిపెడుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు

వీరఘట్టం: గిరిజన మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డివిజినల్ మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ అన్నారు. మండలంలోని తెట్టంగి పంచాయతీ పరిధిలో ఉన్న చెల్లమ్మ చెరువు, జగ్గునాయుడు చెరువు, నడిమసాగరం, కోమటివాని బంద, గేదెలవాని బంద, తాండ్రాసికర, బచ్చలనాయుడు చెరువుల్లో బుధవారం చేపపిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన మత్స్యకారులకు శతశాతం రాయితీపై చేపపిల్లలను అందజేస్తున్నట్లు చెప్పారు. రూ.1.02 లక్షల విలువచేసే చేపపిల్లలను ఆయా చెరువుల్లో విడిచిపెట్టినట్లు తెలిపారు. ఇంతకుముందు వీరఘట్టం సమీపంలోని వెంకమ్మ చెరువులో 3.56 లక్షల ఫింగర్‌లింగ్ సైజ్ చేపపిల్లలు, స్కాంపీ జాతికి చెందిన లక్ష రెయ్యి పిల్లలు విడిచిపెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సబ్సిడీ రుణాలను గిరిజన మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అమరేశ్వరి, రామన్నదొర, సుదర్శనదొర, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సర్కారు సహకారం

పాలకొండ రూరల్: మత్స్య కారులకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందించాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ కోరారు. పంచాయతీ పరిధిలోని పెద్దచెరువులో బుధవారం చేపపిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు మండల పరిధిలో నవగాం, అట్టలి, పనుకువలస, టీడీ పారాపురం గ్రామాల్లోని చెరువుల్లో సుమారు 6 వేల చేపపిల్లలు విడిచిపెట్టినట్లు చెప్పారు. వాటి పెంపకంతో వచ్చే ఆదాయం మత్స్యకారులకు చెందుతుందన్నారు.

కేంద్రం నిధులతో చేపపిల్లల పంపిణీ

సీతంపేట: ప్రత్యేక కేంద్ర నిధులు, గిరిజన ఉపప్రణాళిక పథకంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో 313 చెరువుల్లో 4.66 లక్షల చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ చర్యలు తీసుకుంది. ఫింగర్లింగ్ సైజ్ చేప పిల్లలు కట్ల, రాగండి ఎరమైల రకాలు 40:50:10 నిష్పత్తిలో ఇండియన్ మేజర్ కార్ప్ రకం వందశాతం సబ్సిడీపై గిరిజన మత్స్యసహకార సంఘ రైతులకు, గిరిజన ఎస్‌హెచ్‌జీ, ఎఫ్‌పీవో, వీడీవీకేలకు సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి చేపపిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. చిన్నబగ్గ 32, మర్రిపాడు 5, కుడ్డపల్లి 9 చెరువుల్లో సంబంధిత అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో డి.గోపీకృష్ణ, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఫిషరీష్ అసిస్టెంట్ విజేత, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అమ్మడమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి గ్రామానికి చెందిన సర్పంచ్ కోట రమేష్ తల్లి అమ్మడమ్మ మంగళవారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి బుధవారం పరామర్శించారు. అమ్మడమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం ఇచ్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట నాయకులు లోలుగు నారాయణరావు, తాడేల మన్మథనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుఫానుపై అప్రమత్తం



తోటపల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఫెంగల్ తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. ఈమేరకు మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల సిబ్బందిని బుధవారం అప్రమత్తం చేశారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరికోతలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సూచించారు. నూర్పిడి చేసిన ధాన్యం వర్షాలకు తడిచిపోకుండా భద్రపరుచుకోవాలన్నారు. విక్రయించిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం చేయాలన్నారు. రైతులకు ఎక్కడైనా సమస్యవుంటే రైతు సేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



గుమ్మలక్ష్మీపురం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలాదేవి అన్నారు. ఈమేరకు బుధవారం గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను సీడీపీఓ వివరించారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం జరిపించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే అడ్డుకోవడంతో పాటు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదలింగిలో నేత్ర వైద్య శిబిరం

కొమరాడ: మండలంలోని మాదలింగి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దృష్టి దోషం ఉన్నవారికి ఉచితంగా నేత్ర పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. రవాణా, వసతి, భోజన సౌకర్యం కల్పించడంతో పాటు మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా..

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కొమరాడ: మండలంలోని గుణానపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతుల వద్ద ఉన్న ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతులకు గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ ప్రాతుడు, గులిపిల్లి సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే వాహనాన్ని నడపాలని కురుపాం ఎస్సై పి.నారాయణరావు సూచించారు. కురుపాం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్, సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధించారు. వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోలు, ట్రక్కర్లు, ఇతర వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయకుండా నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ రూరల్: పేదలకు ప్రభుత్వం సమకూర్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు వేగవంతం చేసేలా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పట్టణ పరిధిలో తొమ్మిది సచివాలయాల ఎమినిటీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. వార్డుల వారీగా గృహ నిర్మాణాల తాజా స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ మాధరావు మాట్లాడుతూ నిర్మాణదారులకు శాఖా పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. నిర్మాణ స్థాయికి అనుగుణంగా బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు. అపోహలు వీడి నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముట్టడికి సిద్ధం

సీతంపేట: త్వరలో పాలకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముట్టడికి గిరిజనులంతా సిద్ధం కావాలని గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనుల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. నియోజకవర్గంలో 75 గ్రామాల్లో గ్రావిటేషన్ నీరు తాగి గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

వీరఘట్టం: అగ్ని ప్రమాదాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక కేంద్రం అధికారి జామి సర్వేశ్వరరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్మోదర్షన్, బ్లాంకెటింగ్, కూలింగ్ పద్ధతిలో మంటలను ఏవిధంగా అదుపు చేయవచ్చో వివరించారు. అలాగే ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎలా రక్షించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సాంబర, పీడీ శిర్లాపు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

భామిని: మండలంలోని ఘనసర కాలనీలో వెలసిన మదన కామేశ్వరుని సన్నిధిలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మీ యాగం బుధవారం చివరి ఘట్టానికి చేరింది. యాగంలో మూడో రోజు మహిళలతో కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, సూర్యనమస్కారాలు, మహాన్యాసపూర్వక సహస్ర లింగార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రైతులు అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: తుఫాన్ ప్రభావంతో ఈనెల 29న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి జక్కువ సౌజన్య సూచించారు. మండలంలోని ఆడారు, బిటివాడ గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. పంటకోతలు వాయిదా వేసుకోవాలని, వరి ఓవులను కుప్పలుగా వేసి టార్పాలిన్‌తో కప్పాలని సూచించారు. నూర్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు లేదా కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు.

బ్యాంకు గ్యారంటీలు తప్పనిసరి

గరుగుబిల్లి: మిల్లర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ పి.బాల అన్నారు. మండలంలోని పెద్దూరు రెవెన్యూ పరిధిలో ఉన్న రైస్ మిల్లులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన, ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొనుగోలు చేసినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి లెక్కింపు



పంటకోత ప్రయోగాలు చేస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు పెద్దింటి కృష్ణ, ఏగిరెడ్డి కృష్ణ పంట క్షేత్రంలో 5''5 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రయోగాలు చేపట్టగా 16.200 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు లెక్కించారు. ఈ లెక్కన ఎకరాకు 2624 కిలోల (32 బస్తాలు) దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.